
నమస్తే తెలంగాణ

కామారెడ్డి

5 | నిజామాబాద్, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | KAMAREDDY


# బీసీల అణచివేతకు కాంగ్రెస్ కుట్ర!

కులగణన సర్వే బోగస్




- తప్పుల తడకగా నివేదిక
- బీసీలకు అధికారం దక్కకుండా ఉండడానికే హస్తం పార్టీ ప్రయత్నం
- రేవంత్ ప్రభుత్వంపై బీసీ సంఘాల ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో నిరసనల వెల్లువ

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో బీసీల జనాభాను తగ్గించి చూపడంపై ఉమ్మడి జిల్లాలోని బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికే కాంగ్రెస్ పార్టీ పుట్టి పెరిగిందని గొప్పలు చెప్పుకునే సర్కారు..కుల గణన సర్వే పేరిట బీసీలను తీవ్ర అన్యాయానికి గురిచేసిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. గడిచిన పదేండ్లలో రాష్ట్రంలో బీసీ జనాభా కేవలం 2 లక్షలు మాత్రమే పెరిగినట్లు చూపడంతో రేవంత్ సర్కార్ చేపట్టిన సర్వే తీరుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఓసీల జనాభా పెరగడం, బీసీల జనాభాను తగ్గించి చూపడంతో ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదంటూ బడుగు బలహీన వర్గాలు చర్చించుకుంటున్నాయి. తెలంగాణ ఏర్పడిన తరువాత 2014లో కేసీఆర్ సర్కార్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీ జనాభా గణనీయంగా తగ్గింది. బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీల జనాభా శాతం కూడా తగ్గించి చూపడం సర్కారు దొంగ లెక్కల తీరుకు అద్దం పడుతున్నది. రూ.160 కోట్ల ఖర్చుతో చేపట్టిన సర్వేతో ప్రభుత్వం అభాసుపాలైందని విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సగం మంది బీసీ కుటుంబాలు బతుకు దెరువు కోసం పట్నం బాట పట్టగా.. గణన సర్వే సిబ్బంది సైతం కార్యాలయంలోనే కూర్చొని సర్వే పూర్తి చేసినట్లు ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కుల గణన సర్వే తీరుపై ఎక్కడ చూసినా విమర్శలే తప్ప, ప్రశంసించేవారు కనిపించడం లేదు. కుల గణన సమగ్రంగా, శాస్త్రీయంగా నిర్వహించలేదని, తిరిగి సర్వే చేపట్టి కులాల వారీగా జనాభా జాబితాను విడుదల చేయాలని బీసీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. కామారెడ్డిలో ఎన్నికల సాక్షిగా మాట ఇచ్చిన రేవంత్‌రెడ్డి బీసీల డిక్లరేషన్ ఎటు పోయిందని ప్రశ్నిస్తున్నారు.

### డిక్లరేషన్‌పై మాట తప్పడం సిగ్గుచేటు



బీసీలను అణగదొక్కడానికి కాంగ్రెస్ సర్కార్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నది. మెజారిటీ జనాభా ఉన్న బీసీలు, ఎస్సీ, ఎస్టీలు పదేండ్లలో తగ్గితే..ఓసీల జనాభా 6 నుంచి 15శాతం పెరగడం ఎలా సాధ్యమవుతుంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఇప్పుడు మాట తప్పడం సిగ్గు చేటు. కుల గణన సంపూర్ణంగా జరగలేదు. తిరిగి సర్వే చేపట్టాలి. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

**- కృష్ణ, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు, నాగిరెడ్డిపేట**

### బీసీల పోరాటం తప్పదు



కుల గుణనలో బీసీ సామాజిక వర్గానికి అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తే బీసీల ఐక్యత కోసం పోరాటం చేస్తాం. రాష్ట్రంలో చేపట్టిన గణన సర్వే అంతా తప్పుల తడకగా ఉంది. గతంలో ఆరు శాతం ఉన్న ఓసీలు నేడు 15 శాతం పెరిగితే, 52 శాతం ఉన్న బీసీలు నేడు 46 శాతానికి ఎలా తగ్గుతారు. దీని వెనుక కుట్ర దాగున్నదని తెలుస్తున్నది. బీసీ కులాలతోపాటు ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గడం రాజకీయ కుట్ర. సర్వేను తిరిగి శాస్త్రీయంగా, సమగ్రంగా చేపట్టాలి. లేకుంటే సబ్బండ బీసీ కులాలు ఏకమై పోరాటం చేసేందుకు ముందుకు వస్తాయి.

**-పేరుపల్లి సాయిబాబా, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం**

కూడవెల్లి వాగులో పారుతున్న జల సిరులు

# కరువు సీమలో గంగమ్మ పరవళ్లు

- కాళేశ్వరం జలాలు చూసి మురిసిపోతున్న రైతులు
- మల్లన్నసాగర్ నుంచి నీటి విడుదల
- మత్తడి దూకుతున్న కూడవెల్లి వాగు
- పంటల సాగుకు ఢోకా లేనట్లే

*కరువు సీమలో గోదావరి జలాలు పరుగులు పెడుతున్నాయి. ఎండిపోయిన వాగులు నిండుగా పారుతున్నాయి. కాళేశ్వర ప్రాజెక్టు ఫలాలు ఇప్పుడు కండ్ల ముందర సాక్షాత్కరిస్తున్నాయి. అద్భుత ఇంజినీరింగ్ కట్టడంపై కాంగ్రెస్ పన్నిన కుట్రలను గోదావరి జలాలు ముంచెత్తాయి. అధికార పార్టీ నేతలు చిమ్మిన విషపూరిత విమర్శలు కూడవెల్లి వాగు మత్తడి నుంచి కొట్టుకుపోతున్నాయి. పవిత్రమైన గంగమ్మ జలాలు పంట పొలాలను చేరుతుంటే అన్నదాతలు మురిసిపోతున్నారు. దశాబ్దాల క'న్నీటి' కష్టాలు తొలగిపోయాయని సంబురపడుతున్నారు.*

బీబీపేట్, ఫిబ్రవరి 10: కామారెడ్డి అంటేనే కరువు సీమ. రైతుల కన్నీటి గోసకు చిరునామా. దశాబ్దాలుగా తాగు, సాగునీరు లేక ఈ ప్రాంత రైతులు, ప్రజలు తల్లడిల్లారు. కండ్ల ముందే పంటలు ఎండుతుంటే ఎంతో మంది రైతులు ఉసురు తీసుకున్నారు. మరెంతో మంది వలసబాట పట్టారు. దశాబ్దాలుగా ఏలిన పాలకులు ఈ ప్రాంతంపై చిన్నచూపు చూశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఊరూరా కన్నీటి కష్టాలే. గంపెడాశలతో నాగలి పట్టి, పంట సాగు చేసిన రైతుకు ఏటేటా మిగిలింది నష్టాలే. కానీ స్వరాష్ట్రం సిద్ధించాక, కేసీఆర్ పాలనా పగ్గాలు స్వీకరించాక కరువుసీమలో మార్పు మొదలైంది. సాగునీటి గోస తీర్చే దిశగా అడుగు పడింది. అద్భుతమైన ఇంజినీరింగ్ నైపుణ్యంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కామారెడ్డి ప్రాంత కన్నీటి కష్టాలను తుడిచేసింది. ఎండిపోయిన కూడవెల్లి వాగు ఇప్పుడు పారుతున్నదంటే కారణం ఆ కాళేశ్వరమే. కరువు సీమలో గోదావరి జలాలు మత్తడి దూకుతున్నాయంటే ఆనాడు కేసీఆర్ తీసుకున్న సంకల్ప బలమే.





### శాశ్వత పరిష్కారం కోసం..

సమైక్య రాష్ట్రంలో అప్పటి పాలకులు తెలంగాణను ఆగం చేశారు. నీళ్లు, కరెంట్ ఇవ్వకుండా రైతాంగాన్ని ఇబ్బందుల్లోకి నెట్టారు. దీంతో వేలాది మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అయితే, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆత్మహత్యల పరంపరకు అడ్డుకట్ట వేసింది. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ సరఫరాతో పాటు సమృద్ధిగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది. తాగు, సాగునీటి కష్టాలను దూరం చేసేందుకు, కరువు రక్కసి నుంచి తెలంగాణకు శాశ్వత విముక్తి కల్పించేందుకు అనేక మార్గాలను అన్వేషించింది. ఎన్నో రోజుల మేధోమథనం అనంతరం ఆవిర్భవించినదే కలల ప్రాజెక్టు కాళేశ్వరం. రైతుల గోసకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో అద్భుత ఇంజినీరింగ్ నైపుణ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు కర్షకుల కష్టాలను దూరం చేసింది.

### మత్తడి దూకుతున్న కూడవెల్లి

ఎక్కడో దిగువన ఉన్న కాళేశ్వరం నుంచి వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న కామారెడ్డి ప్రాంతానికి గోదావరి జలాలు వస్తాయని ఎవరూ ఊహించలేదు. కరువు సీమలో గంగమ్మ పరవళ్లు తొక్కుతుందని ఎవరూ విశ్వసించలేదు. కానీ ఆ అద్భుతం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఆవిష్కృతమైంది. మల్లన్నసాగర్ నుంచి విడుదలైన నీళ్లతో కూడవెల్లి వాగు ప్రస్తుతం మత్తడి దూకుతున్నది. బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామశివారులో ఉన్న ఈ వాగు నిండుగా పారుతుండడంతో రైతాంగం మురిసి పోతున్నది. సాగునీటి కష్టాలు ఇక శాశ్వతంగా దూరమయ్యాయని తుజాల్‌పూర్, మల్కాపూర్, యాడారం, కోనాపూర్, రాంరెడ్డిపల్లి గ్రామాల రైతులు సంబురపడుతున్నారు.



కూడవెల్లి వాగు సమీపంలో సాగవుతున్న పంటలు



### సాగునీటికి ఇక ఢోకా లేదు..



ఎన్నో ఏండ్లుగా నీళ్ల కోసం మస్తు తిప్పలు వడ్డం. కండ్ల ముందర పంట ఎండిపోతుంటే గుండె తరుక్కుపోతుండే. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతోని మా కష్టాలు తీరినయ్. సాగునీటికి ఇక రందీ పోయినట్లే. వానకాలంలోనే పారేటి కూడవెల్లి వాగు ఇప్పుడు మత్తడి దూకుతున్నదంటే అది కేసీఆర్ పుణ్యమేనాయే. రెండు పంటలకు ఇక ఢోకా లేనట్లే

**- నక్క సంతోష్, రైతు, తుజాల్‌పూర్**

### భూగర్భ జలాలు పెరుగుతాయి..



ఎక్కడి గోదావరి ఎక్కడికి వచ్చింది. కూడవెల్లి వాగు మత్తడి దూకుతుంటే మస్తు సంతోషమ నిపిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వచ్చిన నీళ్లు మల్లన్నసాగర్ నుంచి మా ఊరికి వస్తాయంటే మొదట్ల నమ్మలే. ఇప్పుడు కండ్ల ముందరకే గంగమ్మ కదిలొచ్చింది. వాగు పారుతుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి.

**- నీరడి వెంకటేశ్, రైతు, తుజాల్‌పూర్**

### కేసీఆర్ గొప్పతనమే..



కామారెడ్డి అంటేనే కరువు గడ్డ అని పేరు. అట్లాంటిది కేసీ ఆర్ వల్ల ఈ ప్రాంతానికి నీళ్ల సమస్య లేకుండా పోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుడుతోని రైతాంగానికి మస్తు మంచి జరుగుతున్నది. ఎక్కడ గోదావరి.. ఎక్కడ కూడవెల్లి. గంగమ్మ ఎటు తిరిగి ఎటు వచ్చింది. ఇప్పుడు కూడవెల్లి వాగుల నీళ్లు పారుతున్నాయంటే ఆ గొప్పతనం కేసీఆర్‌దే కదా.

**- రాజేశ్వర్‌రావు, రైతు, మల్కాపూర్**

# బీసీల నెత్తిపై కాంగ్రెస్ కత్తి



- బడుగుల గొంతు కోసిన రేవంత్
- కాంగ్రెస్ తెలంగాణకు చీడ, ప్రజలకు పీడ
- కేసీఆర్ హయాంలోనే బీసీలకు స్వర్ణయుగం
- కుల గణన రీ సర్వే జరిగే వరకు పోరు ఆగదు
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 10: బీసీల నెత్తిపై కాంగ్రెస్ కత్తి వేలాడుతున్నదని, రేవంత్ సర్కార్ వారిని నిలువునా ముంచిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కుల గణన పేరుతో ఇటీవల నిర్వహించిన బోగస్ సర్వేతో పోయింది కాంగ్రెస్ పరువేనని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టడం కాంగ్రెస్ నైజమని, బడుగుల ను ఏమార్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ వారి గొంతుకోసిందని మండిపడ్డారు. రాజకీయ స్వార్థం, కుయుక్తులు లేకుండా రీ సర్వే చేస్తేనే బీసీ జనాభా ఎంత అన్న విషయంలో కచ్చితమైన గణాంకాలు వెలుగుచూస్తాయని తెలిపారు. బీసీల ఓట్ల కోసం వారిని ఏమార్చేందుకు పచ్చి అబద్ధాలతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెన్నుపోటు పొడిచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీ జనాభాను ఐదున్నర శాతం తక్కువగా చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవంపైనే దెబ్బ కొట్టిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేసన్ల హామీని రేవంత్ సర్కార్ తుంగలో తొక్కిందన్నారు. కాంగ్రెస్ కులతత్వ రాజకీయాలు చూసి బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కామారెడ్డి సభలో 42శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని, బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ పెడతామని, బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తామని కాంగ్రెస్ నమ్మబలికిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### రేవంత్ సర్కార్ దుర్నీతిని ఎండగట్టాలి

బీసీల జనాభాను ఐదున్నర శాతానికి తగ్గించి దాదాపు 22 లక్షల మందిని లేనట్టుగా చిత్రీకరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుర్నీతిని బీసీలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ తెలంగాణకు చీడ, ప్రజలకు పీడ అని అభివర్ణించారు. బీసీలకు అండగా గులాబీ జెండా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ చీటింగ్ చేసిన చోట నుంచే సర్కార్‌పై ఫైటింగ్ మొదలు కావాలన్నారు. కామారెడ్డిలో కొడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కోమాలోకి పోవాలన్నారు. బీసీల దెబ్బకు కాంగ్రెస్ ఏసీ కోటలు కూలాలన్నారు. కేసీఆర్ హయాంలోనే బీసీలకు స్వర్ణయుగమని గుర్తుచేశారు. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో బీసీలకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు బీసీల పోరులో కదం తొక్కాలని, బీసీలకు జరిగిన ద్రోహంపై ప్రజల్లో చర్చ జరగాలని కోరారు. కుల గణన రీ సర్వే జరిగే వరకు పోరు ఆగదని జీవన్‌రెడ్డి స్పష్టంచేశారు.



కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల సంఘం నేతలు

# మాల సంఘాల ఆందోళన

**ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ కేంద్ర మంత్రి, సీఎం దిష్టిబొమ్మల దహనం**

భీమ్‌గల్, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా, ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ నివేదికను నిరసిస్తూ మాల సంఘాల అధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ..గతంలో మాలలకు ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లు ఇప్పుడు ఐదు శాతానికి తగ్గించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మోదీ కనుసన్నల్లో సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నాడని ఆరోపించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఓటమికి మాలలందరం కలిసి పనిచేస్తామన్నారు. మాలల పక్షాన ఉండాల్సిన ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క అసెంబ్లీలో నోరువిప్పక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మాల సంఘం అధ్యక్షుడు భీమా రవీందర్, సంఘ సభ్యులు బట్టు అనిల్, రమేశ్, కాంతయ్య, సునీల్, రాజారాం, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై వివక్ష చూపేవారిపై కఠిన చర్యలు

**తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 10: దళితులపై వివక్ష చూపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. తాడ్వాయి మండలం బ్రహ్మజీవాడిలో ఇటీవల ఆలయంలో భజన కార్యక్రమానికి వెళ్లిన రమేశ్ అనే యువకుడిని అదే గ్రామానికి చెందిన చిన్న గోల్ల సాయిలు అడ్డుకొని బయటికి వెళ్లగొట్టాడు. దీంతో బాధితుడు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోమవారం గ్రామంలో విచారణ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. కుల వివక్షకు పాల్పడిన నిందితుడిని 24 గంటల్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని ఆదేశించారు. మండలంలోని గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాలని తహసీల్దార్ రహీమొద్దీన్‌కు సూచించారు.

## అదనపు కలెక్టర్ అంకిత్‌పై చర్యలు తీసుకోవాలి

**కరీంనగర్ ఎమ్మెల్సీ ఎన్నికల అధికారికి ఫిర్యాదు**

కంఠేశ్వర్, ఫిబ్రవరి 10 : నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్‌పై చర్యలు తీసుకోవాలని బహుజన ముక్తి పార్టీ, తెలంగాణ, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్ సోమవారం ఎన్నికల అధికారి పమేలా సత్పత్తికి ఫిర్యాదు చేశారు. ఈనెల 6న కరీంనగర్‌లో నామినేషన్ దాఖలు చేయగా, వివరాలు సరిగాలేవని ఎన్నికల అధికారి మెమో జారీ చేశారని తెలిపారు. దీనిపై అదేరోజు అదనపు కలెక్టర్ అంకిత్‌ను కలవడానికి ఆయన చాంబర్‌లోకి వెళ్లగా అంటరాని వాడిలా చూసి, కుర్చీలో కూర్చోనీయకుండా వెళ్లగొట్టి ఘోరంగా అవమానించారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అంకిత్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.



జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

- ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి
- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 10 : పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో, బోధన్ డివిజన్ ఆర్వోలు, సహాయ ఆర్వోలకు బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం వేర్వేరుగా మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కలెక్టర్ హాజరై మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు.

### నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ

ఎన్నికల కమిషన్ ప్రకటననుసరిస్తూ రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానా ల ఎన్నిక కోసం నామినేషన్లను స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని నోటిఫికేషన్‌లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని సూచించారు. సమయపాలనను పక్కాగా పాటిస్తూ నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకనుగుణంగా పక్కాగా జరిగితే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహ తో, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీపీవో శ్రీనివాస్, డీఈవో అశోక్, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 10: కామారెడ్డి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికలకు అధికారులను సమాయత్తం చేస్తూ పలు సూచనలు అందజేశారు. ఎన్నికల నిర్వహణ కోసం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, అధికారులు పాల్గొన్నారు.